

నల్లగొండలో ముస్తాబైన ఈద్గా

# ఈద్ ముబారక్

నేడు ఈద్ ఉల్ ఫిత్ర్

## ఈద్గాలలో ప్రత్యేక నమాజ్‌కు ఏర్పాట్లు

## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 10 : రంజాన్ మాసం పురస్కరించుకుని ముస్లింలు నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేశారు. బుధవారం నెలవంక దర్శనంతో గురువారం ఈద్ ఉల్ ఫిత్ర్ జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేకంగా నమాజ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రంజాన్ సందర్భంగా కొత్త దుస్తులు ధరించి, ప్రార్థనలు చేసి ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకోనున్నారు. పేదలకు దాన ధర్మాలు చేయనున్నారు. జిల్లా కేంద్రాలతోపాటు పలుచోట్ల ఈద్గాలను ఇప్పటికే సిద్ధం చేయగా పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొని ప్రార్థనలు చేయనున్నారు. రంజాన్ నేపథ్యంలో బుధవారం మార్కెట్లలో కొనుగోళ్ల సందడి కనిపించింది. కొత్త దుస్తులు, డ్రై ఫ్రూట్స్ తదితర సామగ్రి కొనుగోళ్లలో దుకాణాలు కిటకిటలాడాయి. రంజాన్ మాసం చివరి రోజు కావడంతో హలీమ్, హరీస్ సెంటర్లకు గిరాకీ కనిపించింది. ముస్లింలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్ని సేవలకు మించి మానవ సేవ అత్యున్నతమైనదని చాటిచెప్పిన రంజాన్ పండుగ లౌకిక వాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని, అల్లా దీవెనలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.



### కొమ్మే.. విరగ కాసింది

గరిడేపల్లి, ఏప్రిల్ 10 : సాధారణంగా పనస కొమ్మలకు పూత వచ్చి ఒక్కో కాయ చొప్పున కాస్తాయి. కానీ గరిడేపల్లి మండలంలోని ఎల్‌బీనగర్ గ్రామానికి చెందిన నలబోలు నర్సిరెడ్డి ఇంటి ఆవరణలో ఉన్న పనస చెట్టు ఒకే కొమ్మకు.. ఒకే చోట ఏకంగా 21 కాయలు కాసి చూపరులను ఆకట్టుకుంటున్నది. మూడేండ్ల నుంచి పనస చెట్టుకు కాయలు కాస్తున్నప్పటికీ ఒకే చోట రెండు, మూడు కాయలు కాసేవి. కానీ ఈ సారి ఒకే చోట కాయలు గుత్తులుగా కాసాయని రైతు తెలిపాడు.

# కాంగ్రెస్‌వన్నీ మోసపూరిత హామీలే

**120 రోజుల్లో కేసుల ముచ్చట్లు తప్ప పాలనపై దృష్టి ఏది?**

- గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎండగట్టాలి..
- వీడియోల రూపంలో ప్రజలను చైతన్యం చేయాలి
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేటలో బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం

## అతి తక్కువ కాలంలో కాంగ్రెస్ సర్కారుకు ప్రజల నుంచి వ్యతిరేకత

సూర్యాపేట, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : 'కాంగ్రెస్‌వన్నీ మోసపూరిత హామీలే. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ నాయకుల మాయమాటలకు ప్రజలు మోసపోయారు. పాలనను గాలికొదిలేసి మంత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వీడియోల రూపంలో ప్రజలకు చూపించి పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలి' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో బుధవారం బీఆర్‌ఎస్ నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా జగదీశ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎనలేని వ్యతిరేకత చోటు చేసుకుందన్నారు. ఎన్ని మాయమాటలు చెప్పినా, కుప్పిగంతులు వేసినా మరోసారి మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరని, ఉమ్మడి నల్లగొండలో రెండు ఎంపీ సీట్లు బీఆర్‌ఎస్‌వేనని తెలిపారు.


సూర్యాపేటలో బీఆర్‌ఎస్ నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, వేదికపై మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, ఉన్నత విద్యామండలి మాజీ సభ్యుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, తదితరులు

### కాంగ్రెస్ హామీలే మన ఆయుధాలు..

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు చేసిన ప్రసంగాలు, ఆ పార్టీ ఇచ్చిన హామీలే మన ఆయుధాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందని, ఇప్పటికే ప్రజలు సోషల్ మీడియా ద్వారా వైరల్ చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను పూర్తి స్థాయిలో వివరించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆత్మహత్యలు లేనట్లు కాంగ్రెస్ ప్రభుత్వం నటిస్తున్నదని, పలు కేసులతో వార్తలను సంచలనం చేసేందుకు కుట్రలు పన్నుతున్నదని, కానీ పాలనపై దృష్టి సారించడం లేదని మండిపడ్డారు.

### తప్పుడు సమాచారంతో దుష్ప్రచారం

తప్పుడు సమాచారంతో ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని, కొన్ని పత్రికలు ఇంతవరకు ఎక్కడా లేని విధంగా లీకేజీ వార్తలకు పాల్పడుతున్నాయని జగదీశ్‌రెడ్డి దుయ్యబట్టారు. 120 రోజులుగా కేసుల వార్తలు తప్ప మీడియాలో మరో వార్త రావడం లేదని, వాస్తవానికి కేసులు అయినా, నేరం జరిగినా, తప్పులు చోటు చేసుకున్నా ఆయా సంస్థలు విచారణ చేస్తాయని తెలిపారు. ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు ఒకటి పోతే మరో కేసు అంటూ కేసీఆర్‌పై బురద జల్లే కార్యక్రమమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుకోసారి కేసీఆర్‌ను జైలులో పెడుతామని అంటున్నారని, కానీ ఏ కేసు కూడా కొలిక్కి వస్తలేదని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఒక్కనాడైనా, ఎవరినైనా జైలులో పెడుతామని అన్నామా? పాలన చేతగాక, ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజలను మభ్యపెట్టి ముఖ్యమంత్రి, మంత్రులు కాలం గడుపుతున్నారని విమర్శించారు.

### కేసీఆర్‌ను తిడితే కాంగ్రెస్‌పై వ్యతిరేకత పోతుందా?

మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టడమే కాంగ్రెస్ నాయకులు పనిగా పెట్టుకున్నారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కూడా కొనసాగించలేని దుస్థితిలో ఆ ప్రభుత్వం ఉన్నదని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను తిడితే కాంగ్రెస్‌పై ప్రజలకు ఉన్న వ్యతిరేకత పోతుందా, ఇంకా ఎన్నాళ్లు ఇలా కాలం గడుపుతారని మండిపడ్డారు. పాలన తెలియకుంటే సీనియర్ నాయకులను అడగడమో, గత ప్రభుత్వంలో ఉన్న అధికారులతో సంప్రదింపులు జరుపడమే చేయాలిగానీ గాలికి వదిలేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. డిసెంబర్ 9న హామీలు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పగా, ఇంతవరకు చేయలేదని అన్నారు. కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని ఇన్నాళ్లు ఊరుకున్నామని, ప్రజలకు ఇబ్బందులు కలిగితే సహించేది లేదని తెలిపారు. నీళ్లు లేక పంటలు ఎండిపోతుండడంతో రైతుల కష్టాలు తెలుసుకొని ఆత్మస్థైర్యం నింపేందుకు కేసీఆర్ పొలం బాట పడితే దాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ అర్థం లేని ఆరోపణలు చేసి రైతుల్లో మరింత పలుచనయ్యారని చెప్పారు. రోజురోజుకూ కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నదని, బీఆర్‌ఎస్‌కు ఇది కలిసి వచ్చే విషయమని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు ఖాయమైనట్లేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, సూర్యాపేట జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, ఎంపీపీ నెమ్మాది భిక్షం, జడ్పీటీసీలు జీడి భిక్షం, సంజీవ్‌నాయక్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు

### అభివృద్ధికి చిరునామా బీఆర్‌ఎస్



సమైక్య రాష్ట్రంలో వెనుకబాటుకు గురైన ఉమ్మడి నల్లగొండ జిల్లా బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి పథంలోకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో నీళ్లు లేక, అభివృద్ధి జరుగక ప్రజలు, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రాంతాన్ని మళ్లీ ఎడారిగా మార్చాలనే దురుద్దేశంతో ఆ పార్టీ ఉన్నట్లు కనిపిస్తున్నది. నాగార్జున సాగర్ నీటిని విడుదల చేయకపోవడం, కాళేశ్వరాన్ని పట్టించుకోకపోవడమే ఇందుకు ఉదాహరణ. కాంగ్రెస్ అరాచకాలకు అడ్డుకట్ట వేయాలంటే అభివృద్ధికి చిరునామా అయిన బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలి. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి అభ్యర్థిగా ప్రకటించడం అదృష్టంగా భావిస్తున్నా. ప్రజలంతా ఆదరించి ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో నల్లగొండ వాణిని వినిపిస్తా. పెద్ద ఎత్తున నిధులు తెచ్చి గతంలో మాదిరిగా అభివృద్ధిని కొనసాగిస్తా.

-కంచర్ల కృష్ణారెడ్డి, నల్లగొండ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి

### ఇద్దరు మంత్రులున్నా ఫలితం సున్నా




ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పేరుకు ఇద్దరు మంత్రులు ఉన్నారు. నీళ్ల మంత్రి ఉన్నా ఎండిపోతున్న పొలాలకు చుక్క నీరిప్పించలేదు. రోడ్ల మంత్రి ఉన్నా ఒక ప్యాచ్ వర్క్ కూడా చేయించలేదు. అసమర్థ మంత్రులుగా ప్రజల ముందు మిగిలిపోయారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జిల్లాలో ఒకే ఒక మంత్రి జగదీశ్‌రెడ్డి ఉండి వేల కోట్ల రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు చేశారు. నేడు ఏ పట్టణం, ఏ పల్లెకు వెళ్లినా నాడు చేసిన ప్రగతి పనులు సాక్షాత్కరిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని పక్కన పెట్టింది. కనీసం మొక్కలకు నీళ్లు పోయించలేని దుస్థితి ఆ పాలకులది. సూర్యాపేటతోపాటు పలుచోట్ల వ్యాపారులు, అధికారులను కాంగ్రెస్ పార్టీ నాయకులు బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. అవినీతికి పాల్పడే వారికి ఓట్లడిగే అర్హత లేదు.

-బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్‌ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు

### కాంగ్రెస్‌ది దివాళాకోరుతనం



రాజకీయ చరిత్రలో అతి తక్కువ సమయంలో ప్రజల్లో ఆదరణ కోల్పోయి హామీలు అమలు చేయని ప్రభుత్వంగా కాంగ్రెస్ నిలిచింది. కాంగ్రెస్ సర్కారు దివాళాకోరు తనంతో అత్యధికంగా ప్రమాదంలో పడిన వర్గం రైతాంగం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై ఎన్నో ఆశలతో ఓటు వేసిన యువత, మహిళలు, పింఛన్‌దారులు నేడు మోసపోయామనే భావనలో ఉన్నారు. మరోమారు ఇలాంటి తప్పిదం చేయబోమని చెప్తున్నారు. కాంగ్రెస్‌కు ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడిగే పరిస్థితి లేదు.

- ఒంటెద్దు నర్సింహారెడ్డి, ఉన్నత విద్యామండలి మాజీ సభ్యుడు



సూర్యాపేటలో పార్లమెంట్ ఎన్నికల సమావేశంలో మాట్లాడుతున్న నల్లగొండ కలెక్టర్ హరిచందన, పక్కన సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్, నల్లగొండ, సూర్యాపేట ఎస్పీలు చందన దీప్తి, రాహుల్ హెగ్డే

## పార్లమెంట్ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరిచందన

సూర్యాపేట, ఏప్రిల్ 10 : లోక్‌సభ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల అధికారి, కలెక్టర్ హరిచందన అన్నారు. సూర్యాపేట కలెక్టరేట్‌లో బుధవారం ఏఆర్‌ఓలు, సెక్టార్ అధికారులు, ఎన్నికల బృందాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలు ఉన్నాయని చెప్పారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో జిల్లాలోని తుంగతుర్తి నియోజవర్గంలోని 6 మండలాలు ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా స్వీప్ కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. జిల్లాలో 729 ప్రాంతాల్లో 1,021 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 163 ప్రాంతాల్లో 238 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించామని, అక్కడ గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు. అర్హులైన అందరికీ ఎపిక్ కార్డులు జారీ చేయాలన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో వెబ్ కాస్టింగ్ చేపట్టాలని సూచించారు. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల అవుతుందని, నామినేషన్ ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు. జిల్లాలో కొత్తగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ఉంటే తెలుపాలని చెప్పారు.

### సూర్యాపేట జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశాం : కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట జిల్లాలో ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ వెంకట్రావ్ తెలిపారు. నాలుగు నియోజక వర్గాల పరిధిలో 1,201 పోలింగ్ కేంద్రాలు, 9,98,333 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. అంగవైకల్యం ఉన్న ఓటర్లు 17,212 మంది, 85 సంవత్సరాలు పైబడిన వారు 6,424మంది ఉన్నారని, వారికి హోం ఓటింగ్ చేపట్టేందుకు టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 48 మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఎన్నికల నిర్వహణ కోసం పీఓ, ఏపీఓ, ఈవీఎల మొదటి ర్యాండమైజేషన్ చేపట్టామని అన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 112 రూట్స్ ఏర్పాటు చేసి 123 మంది సెక్టార్ అధికారులను, 6,296 మంది సిబ్బందిని నియమించామని తెలిపారు. ఎన్నికల కోడ్ పక్కాగా అమలవుతుందని, చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశామని చెప్పారు. సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే, నల్లగొండ ఎస్పీ చందన దీప్తి మాట్లాడుతూ జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర బలగాలతోపాటు రాష్ట్ర పోలీస్‌లతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రియాంక, బీఎస్ లత, శ్రీనివాస్, ట్రైనీ ఐపీఎస్ రాజేశ్‌మీనా, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, జడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదనరాజు, డీఎఫ్‌ఓ సతీశ్‌కుమార్, డీసీఓ పద్మ పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్ల రీవాల్యుయేషన్ ఫలితాలు వెల్లడి

రామగిరి, ఏప్రిల్ 10: నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్న డిగ్రీ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన సెమిస్టర్ 1, 3, 5 రీవాల్యుయేషన్ ఫలితాలను బుధవారం సాయంత్రం విడుదల చేసినట్లు యూనివర్సిటీ సీఓఈ డాక్టర్ జి. ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఎంజీయూ వెబ్‌సైట్‌లో లేదా యాప్‌లో ఫలితాలను చూసుకోవాలని సూచించారు. సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు సమాచారం చేరవేయాలని పేర్కొన్నారు.

## 14న సాహిత్య సమాలోచన


నల్లగొండ ఎన్‌జీ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

రామగిరి, ఏప్రిల్10, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి సాహిత్య సమాలోచన సదస్సు ఈ నెల 14న నల్లగొండలోని ఎన్‌జీ కళాశాలలో సృజన సాహితీ ఆధ్వర్యంలో జరుగనుందని నాగార్జున ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు తండు కృష్ణ కౌండిన్య తెలిపారు. ఎన్‌జీ కళాశాల ఆవరణలో బుధవారం సదస్సు పోస్టర్ ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఏనుగు నరసింహారెడ్డి మూడు దశాబ్దాలకు పైగా తెలుగు సాహిత్యంలో చేస్తున్న కృషిని ఈ సదస్సు ప్రతిబింబిస్తుందన్నారు. సృజన సాహితీ అధ్యక్షుడు పెరుమాళ్ల ఆనంద్ మాట్లాడుతూ కవులు, సాహితీవేత్తలు, సాహిత్య విద్యార్థులు, పరిశోధకులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు మాదగాని శంకరయ్య, సాగర్ల సత్తయ్య, బండారు శంకర్, సిలివేరు లింగమూర్తి, దాసోజు జ్ఞానేశ్వర్, యర్ర దేవదానం, దాసోజు రవికుమార్, ఇసురాజు సైదులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే కరువు

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, చిత్రంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, తదితరులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 10 : కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే కరువు పరిస్థితులు నెలకొన్నాయని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం భువనగిరి పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశంతో కలిసి ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే కరెంటు కష్టాలతో మోటర్లు కాలిపోతున్నాయని, సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. చేతికొచ్చిన పంట ఎండి పశువులు, గొర్రెలకు మేపుకోవాల్సి వస్తున్నదన్నారు. గత కేసీఆర్ పాలనలో మిషన్ కాకతీయ ద్వారా 47 వేల చెరువులను బాగు చేసి నీటితో నింపారని, చెక్‌డ్యామ్‌లు ఏర్పాటు చేయడంతో భూగర్భ జలాలు పెరిగాయని అన్నారు. కాళేశ్వరంలో 85 పిల్లర్లు ఉంటే ఒక్క పిల్లర్ కుంగిందనే సాకుతో, పంటలకు సరిపోను నీళ్లున్నా మాజీ సీఎం కేసీఆర్‌పై కోపంతో మోటర్లు నడుపకుండా రైతుల పొలాలను ఎండపెట్టి వారిని సీఎం రేవంత్‌రెడ్డి ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ పాలనలో లేని కరెంట్ కష్టాలు నాలుగు నెలల్లో ఎక్కడి నుంచి వచ్చాయని, ట్రాన్స్‌ఫార్మర్లు ఎందుకు కాలిపోతున్నాయని, రైతుబంధు, రైతుబీమా ఇవ్వడానికి ఎందుకు సాకులు చెబుతున్నారని ప్రశ్నించారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకన్నా మెరుగైన వ్యక్తి అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకుడు సుదగాని హరిశంకర్ గౌడ్, మాజీ జడ్పీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

### 22న నామినేషన్

ఈ నెల 22న బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్లు ఆ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య యాదాద్రి లక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్న అనంతరం పార్టీ జిల్లా కార్యాలయం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేయనున్నట్లు చెప్పారు.


రెడ్డి కాలనీలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా వేస్తున్న హమాలీలు

## రెడ్డి కాలనీలో ధాన్యం కొనుగోళ్లు షురూ

నమస్తే ఎఫెక్ట్

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 10 : మండలంలోని రెడ్డి కాలనీ గ్రామంలో బుధవారం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి కొనుగోళ్లకు చర్యలు తీసుకున్నారు. రెండు సొసైటీల మధ్య గొడవతో ఆగిన కొనుగోళ్లు అధికారుల ఆదేశంతో ఒక్కటై కొనుగోళ్లు చేపట్టారు. దాంతో రైతులు హర్ష వ్యక్తం చేశారు.